సాక్షి ఆదిలాబాద్

సోమవారం, 24, ఏప్రిల్, 2023



తల్లిదండ్రులూ.. పారాహుషార్

వేసవి సెలవుల్లో పిల్లలు తోటి వారితో ఆడుకోవడానికి బయటకు వెళ్తుంటారు. ఈ క్రమంలో ప్రమాదాల బారిన పడుతుంటారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. 9లో▸

రక్తదాన శిబిరం

ఆదిలాబాద్: ఆర్యవైశ్య రక్షక్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మొత్తం 120 యూనిట్ల రక్తం సేకరించినట్లు ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు రాజేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దెబ్బడి ఉల్లాస్, కొత్త హరీష్, ప్రసాద్, ప్రవీణ్ మహాజన్ తదితరులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
36.0/25.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బసవేశ్వరుని ఆశయాలను సాధించాలి



బసవేశ్వర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ రిజ్వాన్, అధికారులు

కైలాస్‌నగర్: కులతత్వ నిర్మూలన, స్త్రీ విద్యకు ఎనలేని కృషి చేసిన మహనీయుడు మహాత్మ బసవేశ్వరుడని అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బసవేశ్వరుడి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంక్షేమశాఖల అధికారులు, బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన బసవేశ్వర చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బసవేశ్వరుని ఆశయాలను కొనసాగించాలన్నారు. మహనీయుల జీవిత చరిత్రలను నేటి యువతరానికి తెలియజేసేందుకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖల అధికారులు కె. రాజలింగు, సునీతకుమారి, శంకర్, పరిశ్రమల శాఖ అధికారి పద్మ భూషణ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం



బండారి కృష్ణ, అధ్యక్షుడు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండారి కృష్ణ మరోసారి ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రమణాచారి, ముఖ్య సలహాదారుడిగా బ్రహ్మానందరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా అల్లాడి రఘురాంరావ్, కోశాధికారిగా వై.మహేందర్, ఉపాధ్యక్షులుగా రవీందర్ రాథోడ్, దేవిదాస్, జి.రమేష్, శ్రీనివాస్, రణిత, సంపత్ కుమార్, అనసూయ, పద్మ, సుజాత, లత, సంయుక్త కార్యదర్శులుగా సంతోష్, చంద్రదాస్, వెంకటరమణ, పుష్పలత, వినయ్, ప్రచార కార్యదర్శిగా ప్రమోద్ కుమార్, కార్య నిర్వాహక కార్యదర్శులుగా విఠల్, ప్రశాంత్ దేశ్ పాండే, శైలేందర్, శ్రీలత, లీల, కార్యవర్గ సభ్యులుగా వెంకటమ్మ, సుగుణ, మీన, కై లాష్, బాపురావు, కిషన్, బలిరాం, ఆనంద్, అర్జున్, ఈశ్వర్‌రెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. ఎన్నికల అధికారిగా రాజేశ్వర్ వ్యవహరించారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సాయిరెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ఆదిలాబాద్‌టౌన్: 2023–24 విద్యా సంవత్సరంలో గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల్లో ప్రవేశం కోసం పట్టణంలో ఏర్పాటు చేసిన ఆయా సెంటర్లలో విద్యార్థులు పరీక్ష రాశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 23 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు గురుకులాల ఆర్‌సీఓ కొప్పుల స్వరూపరాణి తెలిపారు. 8,075 మంది దరఖాస్తు చేసుకోగా 7,626 మంది పరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నారు. ఫలితాలను త్వరలోనే వెల్లడిస్తామని, ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో ఇచ్చిన ఫోన్ నంబర్లకు ఫలితాలు అందుతాయని వివరించారు.

పుస్తకాలొస్తున్నాయ్..

- పునఃప్రారంభం రోజే అందించేలా సర్కారు సన్నద్ధం
- జిల్లాకు 6.50 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరం
- ఇప్పటి వరకు చేరుకున్నవి 2లక్షలు
- విడతల వారీగా రాక

జిల్లాలో..
ప్రభుత్వ పాఠశాలలు 1439
మొత్తం విద్యార్థులు 1,39,421



జిల్లాకు చేరుకున్న పాఠ్య పుస్తకాలు



తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ముద్రించిన పాఠ్యాంశాలు

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు పాఠశాలలను బలో పేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఇందులో భాగంగా గతేడాది నుంచి అన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం తరగతులు ప్రారంభించింది. మన ఊరు–మనబడి ద్వారా మౌలిక సౌకర్యాలనూ కల్పిస్తోంది. అయితే గతేడాది పాఠ్య పుస్తకాల ముద్రణ ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో విద్యార్థులకు సకాలంలో ఇవి అందక ఇబ్బందులకు గురైన విషయం తెలిసిందే. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలు పునఃప్రారంభమయ్యే రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు యూనిఫాం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. అవసరమైన పుస్తకాలు జిల్లాకు విడతల వారీగా చేరుకుంటున్నాయి.

క్యూఆర్ కోడ్‌తో ముద్రణ..

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధన కొనసాగుతోంది. ఈ దృష్ట్యా పుస్తకాల్లో తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో పాఠ్యాంశాలను పక్కపక్కనే ముద్రిస్తున్నారు. దీంతో విద్యార్థులు సులువుగా అర్థం చేసుకునే వీలుంటుంది. అలాగే పుస్తకాలపై క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా పుస్తకాలు పక్కదారి పట్టే అవకాశం ఉండదు. అలాగే దీన్ని స్కాన్ చేయడం ద్వారా స్మార్ట్ ఫోన్‌లో పాఠ్యాంశాన్ని తెలుగు, ఇంగ్లిష్, ఇతర భాషాల్లోనూ చదివే అవకాశం ఉంటుంది. కాగా తెలుగు, ఇంగ్లిష్‌తో కూడిన పాఠ్యాంశాలు ముద్రించడంతో మొదట పార్ట్–1 జూన్ నెలలో విద్యార్థులకు అందించనుండగా, మిగతా పాఠ్యాంశాల కోసం ముద్రించే పార్ట్–2 పుస్తకాలను సెప్టెంబర్ తర్వాత పంపిణీ చేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో..

జిల్లాలో ట్రైబల్ వెల్ఫేర్ ప్రైమరీ స్కూళ్లు 490, ఒక కేంద్రీయ విద్యాలయం, 17 కేజీబీవీలు, మూడు మినీ గురుకులాలు, ఆరు మైనార్టీ వెల్ఫేర్, ఐదు జ్యోతిబాఫూలే గురుకులాలు, 6 ట్రైబల్ రెసిడెన్షియల్ సొసైటీ పాఠశాలలు, 636 జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలలు, 2 ఎయిడెడ్ , 40 ప్రభుత్వ యాజమాన్య, 2 డీఎస్‌టీ, 6 మోడల్ స్కూళ్లు, ఒక స్పోర్ట్స్ స్కూల్, 3 టీఎస్ ఈఎంఆర్ఎస్ పాఠశాలలు, 50 గిరిజన ఆశ్రమ, ఒక అర్బన్ రెసిడెన్షియల్, 167 ప్రైవేట్ పాఠశాలలున్నాయి. ఇందులో ప్రైవేట్ మినహా మిగతా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలన్నింటికీ ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తుంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాకు అవసరమైన పాఠ్యపుస్తకాలు చేరుకుంటున్నాయి. 1నుంచి 10వ తరగతి విద్యార్థులందరికీ వీటిని ఉచితంగా అందజేయనున్నారు. మొత్తం 6లక్షల 50వేల పాఠ్య పుస్తకాలు అవసరం ఉండగా, ప్రస్తుతం 2 లక్షల వరకు చేరుకున్నాయి. 1 నుంచి 3 తరగతుల పాఠ్య పుస్తకాలు ఇంకా రాకపోగా, 4 నుంచి 10 తరగతులకు సంబంధించి పుస్తకాలు వస్తున్నాయి. వీటిని భద్రపర్చేందుకు జిల్లా కేంద్రంలో మూడు గోదాములను ఏర్పాటు చేశారు. రాజీవ్ విద్యామిషన్‌లో, పాలశీతలీకరణ కేంద్రం, మార్కెట్ యార్డులో భద్రపరుస్తున్నారు. ఆయా మండలాలకు త్వరలోనే పంపిణీ చేయనున్నారు. అక్కడి నుంచి పాఠశాలలకు సరఫరా చేస్తారు. జూన్‌లోగా పుస్తకాలను పాఠశాలలకు పంపించేలా చర్యలు చేపడుతున్నారు.

పాఠశాల తెరిచిన తొలిరోజే ఇచ్చేలా చర్యలు



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ పాఠశాల పునఃప్రారంభమైన రోజునే పాఠ్యపుస్తకాలు అందించేలా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికి 2లక్షల పుస్తకాలు జిల్లాకు వచ్చాయి. వాటిని గోదాముల్లో భద్రపర్చాం. మిగతావి వచ్చిన తర్వాత సంబంధిత మండలాలకు సరఫరా చేస్తాం. అక్కడినుంచి పాఠశాలలకు పంపిణీ చేయడం జరుగుతుంది. ప్రస్తుతం పార్ట్–1 పుస్తకాలు వచ్చాయి. సెప్టెంబర్‌లో పార్ట్–2 బుక్స్ రానున్నాయి. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతాం.
– సత్యనారాయణ, టెక్స్ట్‌బుక్స్ మేనేజర్, ఆదిలాబాద్

త్వరగా పూర్తయ్యేనా..

- ఆదిలాబాద్–నిరాల రోడ్డు అభివృద్ధికి సీఆర్‌ఐ నిధులు
- తర్నం బ్రిడ్జి కుంగిపోవడంతో ప్రత్యామ్నాయంగా రహదారి
- త్వరలో టెండర్ నిర్వహణ

లాండసాంగ్వి మార్గంలో రోడ్డు అభివృద్ధి ఇలా..

రోడ్డు మార్గం : ఆదిలాబాద్, లాండసాంగ్వి, అర్లి(బి), అడ, కంఠ ఎక్స్‌రోడ్డు, ముక్తాపూర్, నిరాల

దూరం: 15 కిలో మీటర్లు

అంచనా వ్యయం : రూ.40.24 కోట్లు
నిధులు : కేంద్ర రహదారి మౌలిక సదుపాయాల నిధులు (సీఆర్‌ఐఎఫ్)

రహదారి విస్తీర్ణం ఇలా : ప్రస్తుతం 3.75 మీటర్లు ఉన్న ఈ తారు రోడ్డును 7 మీటర్లకు పెంచడం, ఇరు పక్కల ఒక్కో మీటర్ చొప్పున షోల్డర్ అభివృద్ధి. తద్వారా 9 మీటర్లకు పెంపు.



లాండసాంగ్వి మీదుగా వెళ్లే ప్రస్తుత సింగిల్ రోడ్డు

సాక్షి, ఆదిలాబాద్: జైనథ్ మండలం తర్నం బ్రిడ్జి కుంగిపోవడంతో ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు రాకపోకల పరంగా తీవ్ర ఇబ్బందులు.. జైనథ్, బేల మండలాలకు ప్రధాన రహదారి కావడంతో రవాణాలో ప్రత్యామ్నాయ మార్గంలో దూర భారం పెరిగి వాహనదారుల అవస్థలు నిత్య కృత్యంగా మారింది. ఎన్నికల ఏడాదిలో ఈ అంశం రాజకీయంగా వేడెక్కించింది. అయితే బ్రిడ్జి అభివృద్ధికి సమయం తీసుకునే పరిస్థితి. ప్రత్యామ్నాయంగా మార్గం వెతకడం ద్వారా పరిస్థితిని చక్కదిద్దాలని అధికార పార్టీ తాపత్రయం. ఇందులో జాప్యంపై ప్రతిపక్షాల విమర్శలు. వెరసి ప్రత్యామ్నాయ మార్గాన్ని వెంటనే అభివృద్ధి చేయాల్సిన పరిస్థితి. కేంద్ర నిధులతో ఈ పనులకు అవకాశం లభించిందని ప్రతిపక్షాలు అధికారపార్టీపై దుమ్మెత్తిపోసే పరిస్థితి. మొత్తంగా ఈ రోడ్డు నిధులు మంజూరుకావడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి దోహదపడుతుందని ప్రజల ఆశాభావం.

బ్రిడ్జి కుంగిపోవడంతో సమస్య..

జాతీయ రహదారి 353బి ఆదిలాబాద్ జిల్లాలో జైనథ్, బేల మీదుగా మహారాష్ట్రకు వెళ్లేందుకు అనువైన దారి. ఫిబ్రవరిలో ఈదారి మధ్యలో జైనథ్ మండలంలోని తర్నం వద్ద బ్రిడ్జి కుంగిపోయిన విషయం తెలిసిందే. ప్రత్యామ్నాయంగా ప్రస్తుతం మహారాష్ట్ర వైపు వెళ్లేందుకు ఆదిలాబాద్ మండలం లాండసాంగ్వి మీదుగా వెళ్లే సింగిల్ రోడ్డును వినియోగిస్తున్నారు. రానున్న రోజుల్లో ఎన్‌హెచ్ 353బీ ని అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు అయినప్పటికీ ఆ రహదారి పూర్తి నిర్మాణం దాల్చేందుకు సమయం తీసుకునే అవకాశం ఉండడంతో ప్రత్యామ్నాయంగా లాండసాంగ్విని అభివృద్ధి చేయాలని ఇది వరకే నిర్ణయించారు.

డబుల్ రోడ్డు నిర్మాణం..

ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు వెళ్లేందుకు జైనథ్ మండలంలోని భోరజ్ నుంచి తర్నం బ్రిడ్జి మీదుగా నిరాల, జైనథ్, బేల దాటుకుని వెళ్లాల్సిన పరిస్థితి. బ్రిడ్జి కుంగిపోవడంతో ఆదిలాబాద్ నుంచి మరో మార్గంగా లాండసాంగ్వి, అర్లి(బి), అడ, నిరాల మీదుగా సింగిల్ రోడ్డుపై నుంచి మహారాష్ట్రకు భారీ వాహనాలు వెళ్తున్నాయి. ఈ రోడ్డు ప్రస్తుతం పంచాయతీ రాజ్ ఆధీనంలో ఉంది. దీన్ని డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని అధికారులు ప్రణాళిక చేశారు.

త్వరితగతిన సాధ్యమేనా..

జైనథ్, బేల మీదుగా మహారాష్ట్ర వైపు వెళ్లే 353–బి జాతీయ రహదారిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసే ప్రక్రియకు సంబంధించి ఇప్పటికే టెండర్ ప్రక్రియ దశకు వచ్చింది. రూ.490 కోట్లతో ఈ రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. అయితే దీనికి సుమారు రెండేళ్ల వరకు సమయం పట్టే అవకాశం ఉండడంతో అంత వరకు ఈ రహదారిపై నుంచి వెళ్లే ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఏడాదిలోగా లాండసాంగ్వి రహదారిని అభివృద్ధి చేయాలని అధికారులు ప్రణాళిక చేశారు. వర్షాకాలంకు ముందే ఈ నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు రవాణా ఇక్కట్లు దూరం చేయాలని ఎంపీ సోయం బాపురావు ఆదేశించారు. అయితే అంతలోపు ఇది నిర్మాణం పూర్తయ్యేది అనుమానంగానే కనిపిస్తోంది. కనీసంగా ఏడాదిన్నర సమయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

పీఆర్ నుంచి తాత్కాలికంగా అధీనంలోకి

లాండసాంగ్వి రోడ్డు ప్రస్తుతం పంచాయతీ రాజ్‌శాఖ ఆధీనంలో ఉంది. దీన్ని తాత్కాలికంగా ఆర్ అండ్ బీ(ఎన్‌హెచ్) పరిధిలోకి తీసుకున్నాం. తద్వారా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం. జైనథ్, బేల మార్గంలో రవాణా ఇక్కట్లను దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన ఈ రోడ్డును అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. టెండర్ త్వరలో నిర్వహించి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిస్తాం. – సుభాష్, డీఈ (ఆర్అండ్‌బీ), ఎన్‌హెచ్ సబ్ డివిజన్, నిర్మల్

సీఆర్‌ఐఎఫ్.. కేంద్రానివి కావు

- రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిన పన్నులే
- ఎమ్మెల్యే జోగు రామన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్ (సీఆర్‌ఐఎఫ్) కేంద్రానివి కావని, అవి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పన్నుల రూపంలో చెల్లించిన డబ్బులేనని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఫిబ్రవరి 19న తరోడ బ్రిడ్జి కుంగిందనే విషయాన్ని ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఎంపీ సోయం కేంద్రం ప్రతిపాదించడంతోనే నిధులు విడుదల చేసిందని పేర్కొనడం హస్యాస్పదంగా ఉందన్నారు. ఈ రోడ్డు కేంద్రం ఆధీనంలోనే ఉన్నా తాను నియోజకవర్గ ఎమ్మెల్యేను కనుక ప్రభుత్వం ద్వారా కేంద్రానికి ప్రతిపాదనలను పంపించానని గుర్తు చేశారు. ఈక్రమంలో సీఆర్‌ఐఎఫ్ నిధుల నుంచి రోడ్డు విస్తరణ కోసం నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఎంపీ సోయం బాపూరావు ఒక్కసారైనా కుంగిన వంతెనను పరిశీలించకపోగా, ఎంపీ నిధులు తెప్పించారని ఆదిలాబాద్‌కు చెందిన ముగ్గురు బీజేపీ నాయకులు సోయి లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వారికి చిత్తశుద్ధి ఉంటే సీసీఐ పునరుద్ధరణ, గిరిజన వర్సిటీ, ఎయిర్ స్ట్రిప్, కేంద్రీయ విద్యాలయం వంటి అంశాలపై కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేలా ఉద్యమించాలని హితవు పలికారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాముడి పేరు చెప్పి రాక్షసపాలన సాగిస్తుందని దుయ్యబట్టారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి, జిల్లా రైతు సమితి అధ్యక్షులు రోకండ్ల రమేష్, వైస్ చైర్మన్ జహీర్ రంజాన్, ఎంపీపీ గంద్రత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎండల జోరు.. కూలీల బేజారు



వీరంతా నేరడిగొండ మండలకేంద్రానికి చెందిన ఉపాధి హామీ కూలీలు. పని ప్రదేశంలో తాగు నీటి వసతి కల్పించకపోవడంతో ఇలా ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల నుంచే బాటిళ్లలో నీళ్లు తెచ్చుకుంటున్నారు. పని పూర్తయ్యే వరకు అవి సరిపోకపోవడంతో దాహం తీరని పరిస్థితి. ఈ ఒక్కచోటే కాదు జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలందరిదీ ఇదే పరిస్థితి.

ఇక్కడ కనిపిస్తున్నది ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు. రోజువారీ పనులు పూర్తయ్యాక కొలతలు చేపట్టాల్సి ఉంటుంది. అయితే పని ప్రదేశంలో టెంట్‌లు అందుబాటులో లేకపోవడంతో వీరంతా ఇలా మండుటెండలోనే నిరీక్షించాల్సి వస్తోంది.





తాంసి గ్రామ శివారులో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలు

- 'ఉపాధి' ప్రదేశాల్లో కనిపించని వసతులు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో కూలీలు

జిల్లాలోని గ్రామ పంచాయతీలు	468
మొత్తం జాబ్‌కార్డులు	1.68లక్షలు
నమోదు చేసుకున్న కూలీలు	3.37లక్షలు
పనులకు హాజరవుతున్న కూలీలు	22,241

కైలాస్‌నగర్: భానుడు భగభగకు తోడు డీఆర్డీఏ అధికారుల నిర్లక్ష్యం ఉపాధి కూలీల పాలిట శాపంగా మారుతోంది. పని ప్రదేశాల్లో కూలీలకు తాగునీరు, నీడ వసతితో పాటు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాల్సి ఉండగా అవేవి కానరావడం లేదు. గత్యంతరం లేక తామే ఇళ్ల నుంచి బాటిళ్లలో నీటిని తెచ్చుకుంటున్నామని, అయితే అవి పని పూర్తయ్యే వరకు సరిపోవడం లేదంటున్నారు. అలాగే నీడ వసతి కూడా ఎక్కడా ఏర్పాటు చేయడం లేదని, ఇక పని సమయంలో గాయపడ్డా లేక వడదెబ్బకు గురైనా ప్రథమ చికిత్స అందించేందుకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు సైతం అందుబాటులో లేవని చెబుతున్నారు.

కానరాని వసతులు ...

ఉపాధి హామీలో పనిచేసే కూలీలు ఎండలకు అలసిపోతే కాసేపు సేద తీరేందుకు, భోజన సమయంలో విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా ప్రభుత్వం గతంలో టెంట్‌లను సరఫరా చేసింది. వాటిని ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేసే ప్రాంతాలకు తీసుకెళ్లి కూలీలకు నీడ కల్పించేవారు. అయితే ప్రభుత్వం 2020 మార్చి 20న ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించింది. గతేడాది ఆగస్టులో తిరిగి మళ్లీ విధుల్లోకి తీసుకుంది. అయితే గతంలో వారికిచ్చిన టెంట్‌లు ఏమాయ్యాయో తెలియని పరిస్థితి. సంబంధితాధికారులు వాటిపై దృష్టి సారించకపోవడంతో అవి ఎక్కడికి వెళ్లాయనే ప్రశ్న తలెత్తుతుంది. అలాగే పనిచేసే చోట కూలీలు గాయపడితే వారికి ప్రథమ చికిత్స అందించేలా మెడికల్ కిట్లు సైతం అందించారు. 2016వరకు వీటిని అందించిన ప్రభుత్వం ఆ తర్వాత వాటిని విస్మరించింది. ఎండల్లో పనిచేసే కూలీలకు తాగునీరు అందుబాటులో ఉంచడం ఎంతో కీలకం. కనీసం ఆ సదుపాయం సైతం అధికారులు కల్పించకపోవడం గమనార్హం. దీంతో కూలీలే ఇంటి నుంచి బాటిళ్లలో నీటిని తీసుకెళ్తున్నారు. పని ముగిసే వరకు అవి సరిపోకపోవడంతో దాహార్తి తీర్చుకోవడానికి తల్లడిల్లాల్సి వస్తోంది.

పత్తాలేని పరికరాలు...

ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకు అవసరమైన పరికరాలను గతంలో ప్రభుత్వమే సరఫరా చేసేది. గడ్డపారలు, పారలు, ఇనుప తట్టలు, చెట్లను నరికివేసేందుకోసం గొడ్డళ్లు, కొడవళ్లను సైతం అందించేది. క్రమంగా వాటి సరఫరా సైతం నిలిపివేసింది. దీంతో కూలీలే వాటిని సొంతంగా కొనుగోలు చేసి తెచ్చుకోవాల్సిన దుస్థితి. తాగునీటి కోసం కూలీలకు గతంలో రూ.5లు అదనంగా చెల్లించేవారు. అలాగే ఏప్రిల్, మే నెలల్లో ఎండల్లో పని చేసే కూలీలకు 20శాతం అదనపు భత్యం చెల్లించేవారు. ఇటీవల ఉపాధి హామీ పథకంలో సవరణలను చేసిన కేంద్రం కూలీలకు అందాల్సిన ఈ రెండు ప్రయోజనాలను నిలిపివేసింది. పరికరాల మాట అటుంచితే కనీస సౌకర్యాలను కల్పించాల్సిన అధికారులు వాటిని పట్టించుకోకపోవడంతో పనులకు హాజరయ్యేవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పని ప్రదేశాల్లో వసతులు కల్పించేలా చూడాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వమే సరఫరా నిలిపివేసింది

పని ప్రదేశాల్లో అవసరమైన టెంట్‌లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లను గతంలో ప్రభుత్వం సరఫరా చేసేది. వాటిని కూలీలకు అందించేవాళ్లం. ప్రస్తుతం ప్రభుత్వం వాటి సరఫరా నిలిపివేసింది. కనుక మేమేమి చేయలేం. తాగునీటిని సైతం కూలీలే తెచ్చుకోవాలి.
– ఎస్.కిషన్, డీఆర్డీవో



మహాగావ్‌లో రైతు చేనులో వడగండ్లు



కొత్తపల్లిలో ఇంటిపై ఎగిరిపడ్డ రేకులను తొలగిస్తున్న గ్రామస్తులు

వడగండ్ల బీభత్సం



నాగల్‌కొండలో గాలికి ఎగిరి పడిన రేకులు

నార్నూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో అరగంట పాటు ఈదురుగాలులతో కూడిన వడగండ్లతో జనం ఆందోళనకు గురయ్యారు. కొత్తపల్లి(హెచ్), మల్లెంగి, నాగల్‌కొండ, తాడిహత్నూర్‌తో పాటు గాదిగూడ మండలంలోని లోకారి(కె), రోమన్‌కాస తదితర గ్రామాల్లో ఇళ్లపై ఉన్న రేకులు ఎగిరిపడ్డాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, తీగలు తెగిపడడంతో రాత్రి 9 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. జనం ఇబ్బందులకు గురయ్యారు. – నార్నూర్

క్లుప్తంగా

భాగ్యనగర్‌లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: టుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీ సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన కీర్తి నర్సింగ్ శుభకార్యంలో భాగంగా శనివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి పొన్నారి గ్రామానికి వెళ్లారు. ఆదివారం ఉదయం 10.30 ప్రాంతంలో నర్సింగ్ కుమారుడు దుస్తుల కోసం ఇంటికి వచ్చాడు. తాళం పగలగొట్టి ఉండటం గమనించి కుటుంబీకులకు సమాచారం అందించాడు. వారు అక్కడి చేరుకున్నారు. ఇంట్లోని 15 గ్రాముల బంగారం, 7 తులాల వెండి, టీవీ, హోంథియేటర్, సెటాప్ బాక్స్, రూ.వెయ్యి చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు టుటౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం


కాలిపోయిన సామగ్రి

భైంసారూరల్: మండలంలోని కోతల్‌గాం గ్రామంలో సత్యనారాయణ ఇంట్లో శనివారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాలు.. సత్యనారాయణ ఇంట్లోని కూలర్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చేలరేగాయి. కుటుంబీకులు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి మంటలార్పివేశారు. ఈ ప్రమాదంలో దుస్తులు, వంట సామగ్రి, ఫర్నిచర్ సుమారు రూ.లక్ష వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాజు

కడెం: మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన ఎనగందుల శంకరవ్వ (60) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై రాజు కథనం ప్రకారం.. శంకరవ్వ గతకొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్యం చేయించుకున్నా ఎంతకీ నయం కాకపోవడంతో మనస్తాపం చెంది ఆదివారం ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


'పాఠ్యాంశాల తొలగింపును ఖండిస్తున్నాం'


మాట్లాడుతున్న బైరి సోమేశ్

ఎదులాపురం: ఎన్‌సీఈఆర్టీ సిలబస్ నుంచి జీవపరిణామ క్రమం, పునరుత్పత్తి పాఠ్యాంశాలను, చరిత్ర నుంచి మొఘలుల చరిత్ర, గాంధీ హత్య, గుజరాత్ అల్లర్లు తదితర పాఠ్యాంశాలను తొలగించడాన్ని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైరి సోమేశ్ తీవ్రంగా ఖండించారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ చర్య చరిత్ర, సైన్స్ పై మత శక్తుల దాడిగా పేర్కొన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 1800 మంది సైన్స్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు ఎన్‌సీఈఆర్టీ చర్యలను తప్పుపడుతూ సంస్థ డైరెక్టర్‌కు లేఖలు రాశారన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్‌సీఈఆర్టీ తక్షణమే తమ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

ఫోన్ పోయిందా.. డోంట్ వర్రీ!

- అందుబాటులోకి సీఈఐఆర్ సేవలు
- మొబైల్ పోయినా డేటా పదిలం
- ఇతరులు వాడకుండా బ్లాక్ చేసే వీలు
- మార్చి 15 నుంచే రాష్ట్రంలో అమలు



సీఈఐఆర్ హోమ్ పేజీ

నిర్మల్‌చైన్‌గేట్: మీ ఫోన్ చోరీకి గురైందా? లేక ఎక్కడైనా పోగొట్టుకున్నారా? అందులోని డేటా దుర్వినియోగం కావొచ్చని ఆందోళన చెందుతున్నారా? ఇకపై మీకు ఆ భయం అక్కర్లేదు. ఎందుకంటే..ఆ ముప్పు నుంచి మనల్ని బయటపడేసేందుకు కేంద్రప్రభుత్వం సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్)ను అందుబాటులోకి తెచ్చింది. మార్చి 15 నుంచి తెలంగాణలో అమలులోకి రాగా, దీని ద్వారా పోయిన లేదా చోరీకి గురైన ఫోన్‌ను ఇతరులు వాడకుండా మీరు బ్లాక్ చేయొచ్చు.

ఐఎంఈఐ ఆధారంగా..

సీఈఐఆర్ సేవలు స్మార్ట్‌ఫోన్ ఐఎంఈఐ ఆధారంగా పని చేస్తుంది. సీఈఐఆర్ కోసం దేశంలోని మొబైల్ నెట్‌వర్క్ ఆపరేటర్లు, మొబైల్ తయారీ సంస్థలు సంయుక్తంగా డీవోటీ యూజర్లకు సేవలందిస్తున్నాయి. సీఈఐఆర్ వెబ్, మొబైల్ యాప్ వర్షన్లలో యూజర్లకు అందుబాటులో ఉంది. యూజర్ వెబ్‌సైట్‌కి వెళ్లొచ్చు. గూగుల్ ప్లే స్టోర్‌కు వెళ్లి మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 'నో యువర్ మొబైల్ 'అనే పేరుతో మొబైల్ యాప్ వర్షన్ ఉంటుంది.

పర్సనల్ డిటైల్స్ నమోదుతో రిక్వెస్ట్ ఐడీ..

మొబైల్ యూజర్ వ్యక్తిగత డిటైల్స్.. సదరు వ్యక్తి పేరు, అడ్రస్, గుర్తింపు కార్డు, ఈ–మెయిల్ తదితర వివరాలు నమోదు చేసి సబ్మిట్ పై క్లిక్ చేయాలి. అటుపై యూజర్ ఫిర్యాదు స్వీకరిస్తున్నట్లు రిక్వెస్ట్ ఐడీ నంబర్ వస్తుంది. కంప్లయింట్ స్టేటస్ తెలుసుకోవడానికి ఉపయోగపడనుంది. యూజర్ వివరాల ఆధారంగా మొబైల్ ఫోన్ నంబర్‌ను 24 గంటల్లో సీఈఐఆర్ బ్లాక్ చేస్తుంది. ఫోన్ వివరాలను మొబైల్ నెట్‌వర్క్ ఆపరేటర్లకు పంపుతుంది. సీఈఐఆర్ బ్లాక్ చేసిన ఫోన్‌లో ఎవరు సిమ్‌కార్డు వాడినా వెంటనే అలర్ట్ సందేశం వస్తుంది. ఈ మెసేజ్‌తో యూజర్ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ఏ ప్రాంతంలో ఉన్నదో తేలిగ్గా తెలుసుకోవచ్చు.

పోలీసులకు ఉపయోగం..

మొబైల్ ఏ కంపెనీదైనా సీఈఐఆర్ వివరాలు నమోదు చేస్తే పోలీసు విచారణకు సులువుగా ఉంటుంది. ఫోన్ చోరీ చేసిన వారు ఎక్కడ ఉపయోగించినా ట్రాకింగ్ ద్వారా గుర్తించేందుకు ఈ వివరాలు ఉపయోగపడతాయి. అంతేకాక ఫోన్‌ను వెంటనే బ్లాక్ చేయడం ద్వారా చోరీ చేసిన వారు దాన్ని ఉపయోగించకుండా చూడొచ్చు. ఇక ఫోన్ దొరికాక మళ్లీ అదే ఐడీ నంబర్ ద్వారా సైట్‌లోని అన్‌బ్లాక్ ఫౌండ్ మొబైల్ లింక్‌లోకి వెళ్తే మనం ఉపయోగించుకోవచ్చు.

ఫిర్యాదు చేయాలి

ముందుగా ఫోన్ పోయిన తర్వాత యూజర్.. సమీ ప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. ఎఫ్ఐఆర్ ప్ర తి అందిన తర్వాత సీఈఐఆర్ పోర్టల్ ఓపెన్ చేస్తే.. బ్లాక్ స్టోలెన్ లేదా లాస్ట్ మొబైల్, అన్‌బ్లాక్ ఫౌండ్ మొబైల్, చెక్ రిక్వెస్ట్ స్టేటస్ అనే మూడు ఆప్షన్లు కని పిస్తాయి. బ్లాక్ స్టోలెన్ లేదా లాస్ట్ మొబైల్ ఆప్షన్ మీ ద క్లిక్ చేయాలి. అందులో డివైజ్ ఇన్ఫర్మేషన్ సెక్షన్‌లో ఫోన్, ఐఎంఈఐ నంబర్, ఫోన్ బ్రాండ్ పేరు, మోడల్ తదితర వివరాలు నమోదు చేసి, ఫోన్ కొనుగోలు రసీదు ఫొటో అప్‌లోడ్ చేయాలి. అటుపై లాస్ట్ ఇన్ఫర్మేషన్ సెక్షన్‌లో స్మార్ట్‌ఫోన్ పోగొట్టుకున్న ప్రాంతం, తేదీ, పోలీసు కంప్లయింట్ నంబర్ నమోదు చేసి ఎఫ్ఐఆర్ ప్రతి ఫొటో అప్‌లోడ్ చేయాలి.

ఎలా ఉపయోగించాలంటే..

మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లోకి వెళ్లి దాన్ని బ్లాక్ చేయవచ్చు. ఫోన్ ఇతరుల చేతుల్లోకి వెళ్లినా అది పనిచేయకుండా నియంత్రించవచ్చు. దీంతోపాటు పోగొట్టుకున్న ఫోన్‌కు సంబంధించి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ఏ దశలో ఉందో తెలుసుకోవచ్చు. అదేవిధంగా ఫోన్ దొరికాక అన్‌బ్లాక్ చేసుకోవచ్చు. అయితే ఈ సేవలు పొందా లంటే ముందుగా కొన్ని వివరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత సదరు ఫోన్ పనిచేయకుండా బ్లాక్‌లిస్ట్‌లో పెడతారు. మన ఫిర్యాదు స్థితిని తెలుసుకునే ఆప్షన్ ఈ పోర్టల్‌లో ఉంది.

చెక్ చేసుకోవచ్చు..

పోగొట్టుకున్న వ్యక్తికే ఆ ఫోన్ దొరికితే వెంటనే యూజర్ సీఈఐఆర్ పోర్టల్‌లోకి వెళ్లి అన్‌బ్లాక్ ఫౌండ్ మొబైల్ ఆప్షన్ మీద క్లిక్ చేయాలి. రిక్వెస్ట్ ఐడీ, ఫోన్ నంబర్ డిటైల్స్ ఇచ్చాక ఫోన్ అన్‌బ్లాక్ అవుతుంది. కొత్త ఫోన్ గానీ, సెకండ్ హ్యాండ్ ఫోన్ కొనుక్కోవాలనుకున్న వారు తాము ఎంపిక చేసుకున్న ఫోన్ మోడ ల్, ఐఎంఈఐ నంబర్..వెబ్‌పోర్టల్ కేవైఎం సెక్షన్‌లో గానీ, మొబైల్ యాప్‌లో గానీ రిజిస్టర్ చేయడం ద్వారా గానీ, కేవైఎం 15 అంకెల ఐఎంఈఐ నంబర్ టైప్ చేసి 14422కి ఎస్ఎంఎస్ పంపి, ఫోన్ బ్లాక్‌లిస్ట్‌లో ఉందో..లేదా తెలుసుకోవచ్చు.

250 ఫోన్ల గుర్తింపు



నిర్మల్ జిల్లాలో అందిన ఫిర్యాదులపై ఐఎంఈఐ సాయంతోనే కాక కాల్‌డేటా రికార్డింగ్, ఇతరు సాంకేతిక విధానాలు ఉపయోగించి సుమారు 250 ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించాం. ఫోన్ పోయిన వెంటనే ఆ పరిధిలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఐఎంఈఐ ఆధారంగా దర్యాప్తు చేస్తారు. ఇక సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో పూర్తి సమాచారాన్ని నమోదు చేస్తే త్వరగా ఫోన్‌ను దొరకబట్టడానికి అవకాశం లభిస్తుంది.

– సీహెచ్ ప్రవీణ్‌కుమార్, నిర్మల్ ఎస్పీ

ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి

- ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి


శిక్షణ ఇస్తున్న ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి

ఆదిలాబాద్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేలా డ్రైవర్లు కండక్టర్లు కృషి చేయాలని ఆదిలా బాద్ ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లకు ఇస్తు న్న ట్యాక్ట్ (టీఎస్ ఆర్టీసీ ఏప్రిల్ ఛాలెంజ్ ఫర్ ట్రైనింగ్)లో ఆదివారం పాల్గొని పలు అంశాలపై వారికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారికి చేరువ కావాలన్నారు. వారితో మమేకమవుతూ వారికి మెరుగైన సేవలందించడానికి పాటుపడాలన్నారు. ప్రాజెక్టర్ ద్వారా వృత్తి నైపుణ్యాలు, ఇతర అంశాలపై శిక్షణ అందజేస్తున్నామని పే ర్కొన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

20 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 20 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ మల్లేశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మంచిర్యాల ఎక్స్‌రోడ్ వద్ద ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో పలువురికి డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష నిర్వహించగా 20 మంది మద్యం తాగినట్లు తేలింది. ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ ఉన్నారు.

పల్లె..ప్రకృతివనం


ఉమ్రి(కే)లోని పల్లె ప్రకృతివనం

- రాష్ట్రంలోనే ఉమ్రి(కే) ఆదర్శం
- గ్రామం అభివృద్ధి వైపు అడుగులు
- స్వచ్ఛతలోనూ, పరిశుభ్రతలో ముందంజ
- వందశాతం మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు

తానూరు: మండలంలోని ఉమ్రి(కే) గ్రామం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం సంకల్పం, గ్రామస్తుల చైతన్యంతో గ్రామం స్వచ్ఛత, పరిశుభ్రతతో ముందంజలో ఉంది. ఉమ్రి(కే) ప్రకృతివనంలో నాటిన మొక్కలు పెరిగి పచ్చదనంతో కళకళలాడుతోంది. ఆహ్లాదభరితంగా ఉన్న ఈ వనం రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

ఆదర్శం..

రాష్ట్ర ప్రభుత్వం పట్టణాల మాదిరిగా గ్రామాల్లో ప్రతిష్టాత్మకంగా పల్లెకో ప్రకతివనం ఏర్పాటు చేస్తోంది. వనంలో మొక్కలు నాటించి అద్భుతంగా పార్క్‌ను ఏర్పాటు చేశారు. ఉమ్రి(కే) ప్రకృతివనం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచింది. వనంలో నాటిన మొక్కలను సంరక్షించడంతో ప్రస్తుతం అవి చెట్లుగా ఎదిగి పచ్చదనంతో కళకళలాడుతోంది. అప్పటి కలెక్టర్ ముషారఫ్‌అలీ ఫారుఖీ.. జిల్లాలోనే ఉమ్రి(కే) బెస్ట్ పల్లె ప్రకృతివనంగా ఎంపిక చేసి, సర్పంచ్, కార్యదర్శికి అవార్డులు అందజేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లో జరిగిన ఏడో గార్డెన్ ఫెస్టివల్‌లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది. వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్, పంచాయతీరాజ్ డైరెక్టర్ హన్మంత్‌రావ్‌లు సర్పంచ్ పవలే తర్నమాల, కార్యదర్శి వినయ్‌కుమార్‌లకు అవార్డు అందజేశారు. నాటి న మొక్కలు ఆహ్లాకరంగా మారి పట్టణంలో ఉన్న పార్క్ మాదిరిగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తూ..

గ్రామంలో మొత్తం జనాభా 13 వందలకు పైగా ఉంది. పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కమిటీని ఏర్పాటు చేసుకుని గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించారు. గ్రామం అభివృద్ధి బాటలో నడపించాలని తీర్మానం చేసి గ్రామంలో సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నారు.

వందశాతం మరుగుదొడ్లు

మరుగుదొడ్ల నిర్మాణంలో తానూరు మండలంలోనే ఉమ్రి(కే) ప్రథమ స్థానంలో ఉంది. అధికారుల సహకారంతో వందశాతం మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు నిర్మించుకున్నారు. 30 రోజుల ప్రణాళిక, పల్లె ప్రగతిలో భాగంగా పూడికపోయిన మురుగుకాల్వలను శుభ్రపరిచారు. రక్షిత మంచి నీటి పథ కం ద్వారా ఇంటింటికీ ఏర్పాటు చేసిన నల్లాల ద్వా రా ఉదయం , నీటిని సరఫరా చేస్తున్నారు. హరితహారంలో ఆయా వీధుల్లో మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. కిరాణ షాపుల యాజమానులకు అవగాహన కల్పించి ప్లాస్టిక్ నిషేధించారు. ప్రతి ఇంటికి తడి,పొడి చెత్త కోసం చెత్తబుట్టలు పంపిణీ చేశారు. ట్రాక్టర్‌లో రోజువారీగా సేకరించిన తడి,పొడి చెత్తను వేరుచేసి ఇస్తున్నారు. సెగ్రిగేషన్ షెడ్డులో ఎరువుగా తయారు చేస్తున్నారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాలను రంగులు వేయించి విద్యార్థుల సంఖ్యను పెంచారు. గ్రామ వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

సీసీ రోడ్ల నిర్మాణం

గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, రూ.6 లక్షలతో డ్రెయినేజీలు నిర్మించి కొంత మేర సమస్యలు పరిష్కరమయ్యాయి. గ్రామంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో గత మూడేళ్ల క్రితం ఈజీఎస్ నిధులు రూ.8 లక్షలతో శ్మశాన వాటిక నిర్మాణం, చెత్త సేకరణకు డంపింగ్‌యార్డు ఏర్పాటు చేశారు. ఎకరంలో క్రీడామైదానాన్ని ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో బస్టాండ్, పాఠశాల ఆవరణ, హనుమాన్ ఆలయ ప్రాంగణంలో సిమెంట్ కుర్చీలు ఏర్పాటు చేశారు.

కార్మికులను నియమించారు



గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులను నియమించడంతో మురుగుకాలువలను శుభ్రపరుస్తున్నారు. రోజు చెత్తను ట్రాక్టర్ ద్వారా తరలించి గ్రామాన్ని శుభ్రంగా ఉంచుతున్నారు. గ్రామంలో నాటిన మొక్కలు పెరిగి ఆహ్లాదకరంగా కనిపిస్తోంది.

– సూర్యకాంత్, గ్రామస్తుడు, ఉమ్రి(కే)

అందరి సహకారంతో..



అందరి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ప్రతి ఇంటికి మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయించి గ్రామాల పరిశుభ్రత పాటిస్తున్నాం. రక్షిత మంచి నీటి పథకం ద్వారా ప్రతి ఇంటికి నల్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. దాతల సహకారంతో సిమెంట్ కుర్చీలు ఏర్పాటు చేశాం. అధికారుల సాయంతో పల్లె ప్రకృతివనం అద్భుతంగా తీర్చిదిద్ది రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది.

– రత్నమాల, సర్పంచ్

చర్యలు తీసుకున్నాం



ప్రకృతివనంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకున్నాం. ప్రతి రోజు మొక్కలకు నీటిని అందించడంతో అవి పెరిగి పల్లె ప్రకృతివనం ఆహ్లాదకరంగా కనిపిస్తోంది. గ్రామస్తుల సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నాం.

– వినయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి

ప్రశాంతంగా టీజీ సెట్


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లి: ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన తెలంగాణ గురుకుల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీజీసెట్) –2023 ఉమ్మడి ఆదిలాబాద్ రీజియన్‌లో ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష నిర్వహణ కోసం రీజియన్ పరిధిలో 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో మొత్తం 8,075 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 7,627 మంది హాజరయ్యారు. 448 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. దీంతో 94.45 శాతం విద్యార్థుల హాజరు శాతం నమోదైనట్లు సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కో–ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 2,397 మందికి 2,238 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 8 పరీక్ష కేంద్రాల్లో 2,603 మంది విద్యార్థులకు 2,467 మంది పరీక్షకు హాజరయ్యారు. అదే తీరుగా మంచిర్యాల జిల్లాలో ఎనిమిది పరీక్ష కేంద్రాలు ఉండగా వీటిలో 3,075 మంది విద్యార్థులకు 2,922 మంది పరీక్ష రాశారు. పరీక్ష ఉదయం 11గంటలకు ఉండగా విద్యార్థులు ముందస్తుగా ప్రకటించినట్లుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల ప్రధాన ద్వారాల వద్ద విద్యార్థులను నిశితంగా పరీక్షించిన తర్వాత లోనికి పంపించారు.

పరీక్ష కేంద్రాలను సందర్శించిన కో ఆర్డినేటర్

బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన తెలంగాణ గురుకుల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ పరీక్ష కేంద్రాలను సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కో ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ బాలుర గురుకుల పాఠశాల (టీఎస్ ఆర్ఎస్), సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కాసిపేట సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలతో పాటు సీఓఈ బాలుర కళాశాల పరీక్ష కేంద్రాలకు వెళ్లి విద్యార్థులు రాస్తున్న పరీక్ష తీరును పరిశీలించారు. ఆమె వెంట ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు ఐనాల సైదులు, బి.శ్రీనివాస్, ఊటూరి సంతోష్‌కుమార్, ఎస్.స్వరూప, డిపార్ట్‌మెంటల్ అధికారులు ప్రేమరాణి, తులసి, విశ్వాస్, దేశీపాల్, కవితరాణి ఉన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద తాళ్ల గురిజాల ఎస్సై బందోబస్తును పర్యవేక్షించారు.

కుక్కల దాడిలో ఏడు గొర్రెలు మృతి


ఆందోళన చేస్తున్న నాయకులు


గాయాలైన నాగోరావు, శ్రేష్ఠ


గాయపడ్డ స్వాతి

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె పంచాయతీ పరిధిలోని నడింపల్లెలో ఆదివారం కుక్కల దాడిలో 7 గొర్రెలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన రైతు దాసరి పోసమల్లు గొర్రెల కొట్టం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసినప్పటికీ రాత్రివేళ అందులో కుక్కలు చొరబడి దాడి చేశాయి. ఇందులో 7 గొర్రెలు మృతిచెందగా, 4 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. సుమారు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం తనకు పరిహారం అందించాలని వేడుకున్నాడు.

గోసంపల్లె చౌరస్తా వద్ద రాస్తారోకో..

కుక్కల బెడద నివారించడంలో పంచాయతీ పాలక వర్గం, అధికారుల వైఫల్యం కారణంగానే గొర్రెలు మృత్యువాత పడ్డాయని బాధితులు ఆందోళనకు దిగారు. గోసంపల్లె చౌరస్తాలో ప్రధాన రహదారిపై మృత్యువాతపడ్డ గొర్రెలను పెట్టి రాస్తారోకో నిర్వహించారు. వెంటనే స్పందించి కుక్కల బెడద లేకుండా చేయడంతోపాటు నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న బాధితులకు మద్దతుగా బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బైఠాయించారు. గొర్రెలతో గంటపాటు ఆందోళన చేసినా ఎవరూ రాకపోవడంతో వాటిని అక్కడే రోడ్డుపై వదిలివెళ్లిపోయారు. నాయకులు కొమురయ్య, కాలేరి విలాస్, కరిపె రాజ్‌కుమార్, బిల్ల శంకర్ తదితరులు ఉన్నారు.

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: వీధి కుక్కలు దాడి చేసిన ఘటనలో ఆదివారం ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణంలోని ఖుర్షాపూర్‌కు చెందిన ఇమ్రాన్‌ఖాన్, మావల మండలం వాగాపూర్‌కు చెందిన కుడ్మెత గంగారంలు ఆయా ప్రాంతాల్లో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. తీవ్ర గాయాలపాలైన బాధితులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు వచ్చి చికిత్స పొందుతున్నారు. కాగా కుక్కల దాడులు ఇటీవల పెరుగుతుండటంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

కుంటాలలో నలుగురికి తీవ్రగాయాలు

కుంటాల: మండల కేంద్రంలో ఆదివారం కుక్కల దాడిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన రైతు నాగోరావు, విద్యార్థులు శ్రేష్ఠ, స్వాతి, రమ్యలు పరుగులు పెడుతున్న కుక్కలు వెంబడించి వారిపై దాడి చేశాయి. స్థానిక వైద్యశాలలో నాగోరావు, శ్రేష్ఠ, రమ్యకు ప్రాథమిక చికిత్స నిర్వహించారు. స్వాతి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. పిచ్చికుక్కలను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


వద్యాల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

లక్ష్మణచాంద: మండలంలోని వద్యాల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000 –01 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి వి ద్యార్థులు కలుసుకున్నారు. ఆదివారం ని ర్వహించిన అపూర్వ సమ్మేళనానికి 23 ఏళ్ల తర్వాత వీరంతా హాజరయ్యారు. ఒకరి కొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కిషన్‌రావు, మచ్చేందర్, మోహన్‌రావు, నరేందర్, నజీర్, అరవింద్ కుమార్‌ను సన్మానించారు. పూర్వ విద్యార్థులు నరేందర్, నాగేష్, నర్సయ్య, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

కుభీర్‌లో..


కుభీర్‌లో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కుభీర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2002–03 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం ని ర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. 20 ఏళ్ల తర్వాత కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి పాదాభివందనం చేశారు. అనంతరం అందరు కలిసి సహపంక్తి భోజనం చేశారు. సర్పంచ్ మీరా విజయ్, మండల ఉపాధ్యక్షుడు మోహినొద్దీన్, ఎంపీటీసీ పోసాని భాయి, తహసీల్దార్ విశ్వంబర్, ఎంఈవో చంద్రకాంత్, ఉపాధ్యాయులు మహేశ్వర్‌రావు, లింగన్న, ప్రేమ్‌సాగర్, సాయన్న, సురేష్, విజయ్‌కుమార్, గంగా ధర్, అనిల్‌రమేష్, సదానంద్, గజరాజ్‌గౌ డ్, విద్యార్థులు రజిత, భీంరావ్, కె.నరేశ్, సాయినాథ్, జమున, గంగామణి, జ్యోతి, రాజేశ్వర్, మహేశ్, విశ్వనాథ్, వివేక్ ఉన్నారు.

సెలవులకు వచ్చి అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి
- మరొకరికి స్వల్పగాయాలు


సత్యవంశీ (ఫైల్)

నిర్మల్‌టౌన్: సెలవులకు వచ్చిన ఓ విద్యార్థి అనంత లోకాలకు వెళ్లిపోయాడు. అతివేగంతో వెళ్తున్న బైక్ అదుపుతప్పి రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఒకరి మృతిచెందగా, మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన విషాదమిది. వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక ద్యాగవాడ చెందిన బండారి శ్రీను కుమారుడు సత్యవంశీ (19). హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. రెండురోజులు సెలవులు ఉండడంతో శుక్రవారం నిర్మల్‌కు వచ్చాడు. ఆదివారం సాయంత్రం స్నేహితుడితో కలిసి బైక్‌పై బయటకు వెళ్లాడు. సత్యవంశీ అతివేగంగా బైక్ నడుపుతున్నాడు. సిద్దాపూర్ శ్మశానవాటిక వద్ద బైక్ అదుపుతప్పి కింద పడిపోయారు. సత్యవంశీకి తీవ్రగాయాలు కాగా, అతని స్నేహితుడికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు గమనించి అంబులెన్స్‌లో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సత్యవంశీ మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఘటన స్థలానికి చేరుకున్న పట్టణ సీఐ మల్లేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.